E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 13-02-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:43 || పేజీలు–6 www.ekaburu.com



ఏ అధికారంతో కూల్చివేతలు చేపట్టారు!


» 3లో

## పొలిటికల్ లీడర్ కబంధ "హస్తం" నుంచి

# ఖానామెట్ భూములు విడుదల

- ప్రభుత్వ భూముల్లో షెడ్లు వేసి నెలనెలా రూ.40 లక్షల అద్దెలు వసూలు
- హైటెక్ సిటీలో హైడ్రా భారీ ఆపరేషన్
- మొండికుంట చెరువు, ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు
- రూ.2200 కోట్ల విలువైన 11 ఎకరాలను కబ్జాల నుంచి కాపాడిన హైడ్రా

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
"" అతనో రాజకీయ పార్టీ నాయకుడు... తనకు ఉన్న రాజకీయ "హస్తం" అండదండలతో ఏకంగా ప్రభుత్వ భూములు, చెరువు మీద కన్నేసాడు... వందల కోట్ల విలువైన భూములను హస్తగతం చేసుకొని షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాడు.. వాటిని వ్యాపార సముదాయాలకు అద్దెకు ఇచ్చి నెలనెలా దాదాపు 40 లక్షల మేర జేబులో వేసుకుంటున్నాడు... చివరికి స్థానికుల ఫిర్యాదులతో హైడ్రా రంగంలోకి దిగడంతో ఈ రాజకీయ నాయకుడి అక్రమ సామ్రాజ్యం నేలమట్టమైంది.""





ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను
**కూల్చివేస్తున్న హైడ్రా**

మాదాపూర్ హైటెక్ సిటీ పరిధిలోని ఖానామెట్ ప్రధాన రహదారి వెంట ఉన్న రబ్దాలపై శుక్రవారం హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ఖాజామెట్ లోని మొండికుంట చెరువుతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భారీ ఎత్తున ఏర్పాటు చేసిన షెడ్లు, వాణిజ్య సముదాయాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. దాదాపు 2200 కోట్ల రూపాయల విలువైన 11 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి రక్షించారు. కోర్టులో కేసులు ఉండగా సదరు స్థలంలో కబ్జాదారులు పెద్ద ఎత్తున షెడ్ల నిర్మాణం చేపట్టి, అద్దెకు ఇచ్చి నెలనెలా లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. శుక్రవారం హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ సర్వే నెంబరు 55లో ఉన్న మొండికుంట చెరువుతో పాటు పక్కనే సర్వే నెంబరు 55లో ఉన్న ప్రభుత్వ భూమిని ఓ రాజకీయ పార్టీ నాయకుడు ఆక్రమించాడు. తనకు ఉన్న రాజకీయ అండదండలతో పాటు అధికారులను మచ్చిక చేసుకొని మొండికుంట చెరువులో భారీ ఎత్తున మట్టిని నింపి, చదును చేయడంతో పాటు చెరువు స్థలంలో భారీ షెడ్లను ఏర్పాటు చేశాడు.

తరువాయి 2లో



## రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

- భాజపా ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్

ఈ కబురు : కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని భాజపా ఎంపీ నిషికాంత్ దూబే డిమాండ్ చేశారు. ఈమేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు.



## 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఏఐ యాక్సెస్

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ఈ కబురు : ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో లానే విద్యారంగంలోను కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తుంది. ఈ కొత్త ఏఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు



## కార్మికుల కష్టంతోనే ఈ దేశం నడుస్తోంది

- టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్

ఈ కబురు, హైదరాబాద్:
కార్మికుల హక్కులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ హక్కు మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.

## రేవంత్ రెడ్డికి విద్యార్థుల సమస్యలపై సమీక్షించే తీరిక లేకపోవడం సిగ్గుచేటు : హరీశ్ రావు

ఈ కబురు, హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక పాఠశాలలో భోజనంలో కల్తీ జరిగి అస్వస్థతపాలవుతున్న విద్యార్థులపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించే తీరికలేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీశ్ రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ మండలం ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కల్తీ ఆహారం మాకొద్దు అంటూ రోడ్డెక్కిన విషయం, హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో భోజనం బాగుండటం లేదని విద్యార్థుల నిరసనలపై ట్వీట్ ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు

....(2లో)



## తెలంగాణలో భారీ విమానాశ్రయాలు

- శంషాబాద్ విమానాశ్రయానికి దీటుగా
- అత్యాధునిక సౌకర్యాలతో
- మరో మూడు విమానాశ్రయాలు
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ
- వరంగల్ సమీపంలోని నిర్మితమవుతున్న మామునూరు, కొత్తగూడెం, ఆదిలాబాద్
- విమానాశ్రయాలకు సంబంధించి బ్లూ ప్రింట్లు అందజేత

తరువాయి 2లో



## 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు

### .. తెలంగాణలోనూ అప్పుడే: సీఎం రేవంత్‌రెడ్డి



ఈ కబురు, ఢిల్లీ: దేశ వ్యాప్తంగా 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని, అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసిన అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ రైలు వచ్చిందని, హైదరాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు హబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు ఫ్యూచర్ సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నట్టు చెప్పారు. "ఎన్టీఆర్ జాతీయ నాయకుడు.. అమీర్‌పేటలో ఆయన విగ్రహం పెట్టి తీరుతాం.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా. నూటికి నూరు శాతం మా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం నాకు అవసరం లేదు. నేను ప్రజల అభిప్రాయం మాత్రమే తెలుసుకుంటాను. ఎస్ఐబీలో పరికరాల మాయంతో ఫోన్ ట్యాపింగ్ కేసు బయటపడింది. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే ఆ కేసు దర్యాప్తు జరుగుతోంది. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తాం. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. 2018లో తెచ్చిన నిబంధనల మేరకే సింగరేణిలో టెండర్లు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతాం. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా? సింగరేణి సంస్థ అప్పులు మా హయాంలో పెరగలేదు.

తరువాయి 2లో

## తెలంగాణ పంచాయతీలకు శుభవార్త

### ...కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల



- వారం క్రితం తొలి విడతలో రూ.259.63 కోట్లు విడుదల
- రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులు విడుదల
- పెండింగ్‌లో ఉన్న మరో రూ.2,400 కోట్ల నిధులు

....(2లో)

## పవన్ తో బాలయ్య భేటీ

### .. ఎకో పార్క్ అభివృద్ధికి నిధులపై చర్చ

- డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి అధికారులకు ఫోన్
- మడకశిర కాలువ వెడల్పుకు మంత్రి రామనాయుడుకు వినతి
- టేకులోడు పారిశ్రామిక అభివృద్ధిపై టిజి భరత్ తో సమీక్ష
- సోమందేపల్లి --తూముకుంట నాలుగు వరుసల రోడ్డు పై బీసీ జనార్ధన్ రెడ్డితో ప్రత్యేక సమావేశం
- మునిసిపల్ నూతన కార్యాలయ భవనం పై నారాయణతో సమావేశం



ఈ కబురు; శాసనసభ సమావేశాలు కు హాజరైన స్థానిక ఎమ్మెల్యే పద్మ భూషణ్ నందమూరి బాలకృష్ణ గురువారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు మంత్రులని సమావేశమయ్యారు.. డిప్యూటీ సీఎంతో సమావేశమైన నందమూరి బాలకృష్ణ హిందూపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పంచాయతీరాజ్ అటవీ శాఖ నుంచి నిధులు అధికంగా ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా సురప్పకుంట్లో ఏకో పార్క్ అభివృద్ధికి నిధులు త్వరగా విడుదల చేయాలని పవన్ తో కోరగా అందుకు స్పందించిన డిప్యూటీ సీఎం వెంటనే ఎకో పార్క్ కు సంబంధించిన నివేదికలు తెప్పించుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు

తరువాయి 2లో

ఈ-కబురు

13 - 02 -2026
శుక్రవారం
e-kaburu.com

# తెలంగాణలో భారీ విమానాశ్రయాలు

ఈ కబురు; తెలంగాణలో భారీ విమానాశ్రయాలు రూపుదిద్దుకుంటోన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ధీటుగా, అత్యాధునిక సౌకర్యాలతో మరో మూడు ఎయిర్ పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. ఇవి కార్యకలాపాలు ప్రారంభిస్తే ఉత్తర తెలంగాణ జిల్లాలకు కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుంది. వాటి నిర్మాణ పనులను ప్రభుత్వం ముమ్మరం చేస్తోంది. దీనికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసింది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేశ రాజధానిలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో భేటీ అయ్యారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలను అందజేశారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీ మల్లు రవి, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ అధికారులు, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఉన్నారు. వరంగల్ సమీపంలో నిర్మితమౌతోన్న మామునూర్, కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయల బ్లూ ప్రింట్స్, ఇతర ప్రతిపాదనలు అందజేశారు. భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో మామునూర్ విమానాశ్రయానికి అవసరమైన పనులను ప్రారంభించాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రిని కోరారు. అలాగే ప్రతిపాదిత కొత్తగూడెం విమానాశ్రయానికి అబ్ స్టాకిల్ లిమిటేషన్ సర్ఫేసెస్ (ఓ ఎల్ ఎస్) సర్వే పనులను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏ ఏ ఐ )కి కన్సల్టెన్సీ ఫీజుల చెల్లింపునకు పాలనాపరమైన ఆమోదం తెలిపామనీ అన్నారు. దీనికోసం తెలంగాణ ప్రభుత్వం గతంలో 40.43 లక్షల రూపాయల మొత్తాన్ని విడుదల చేసింది. కొత్తగూడెం ఎయిర్ పోర్ట్ కోసం పాల్వంచ అంతర్గామ్ వద్ద భూమిని గుర్తించామని రామ్మోహన్ నాయుడికి వివరించారు. దీనికి ప్రత్యామ్నాయ స్థలానికి తక్షణ అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం కేంద్రానికి అదనంగా 249.82 ఎకరాలు అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయం అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇదివరకే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. దీని ప్రకారం ఇక్కడ మూడు కిలో మీటర్ల పొడవైన రన్‌వే నిర్మిస్తారు. విమానాశ్రయానికి ఒకవైపు పౌర టెర్మినల్, మరోవైపు ఐఏఎఫ్ స్టేషన్ ఉంటాయి. ఇది పౌర విమానాల రాకపోకలు సాగించడానికి, భారత వైమానిక దళం స్టేషన్ రూపంలో జాయింట్ గా పనిచేస్తుంది. గతంలోనే ఈ ప్రతిపాదనకు ఐఏఎఫ్ అంగీకరించింది. ఎన్ఓసీ కూడా జారీ చేసింది. ఫలితంగా విమానాశ్రయం డెవలప్మెంట్ కు మార్గం ఏర్పడింది.



# పొలిటికల్ లీడర్ కబంధ "హస్తం" నుంచి
## ఖానామెట్ భూములు విడుదల



ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా



ఖానామెట్ లో నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు



ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా

దీంతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో సైతం ఓ దేవాలయానికి అనుసందానంగా భారీ షెడ్లను ఏర్పాటు చేసి నెలవారి అద్దెలు వసూలు చేయసాగారు. సదరు భూమిపై కోర్టులో కేసు ఉన్నప్పటికీ యథేచ్ఛగా ఎకరాల కొద్ది విస్తీర్ణంలో కబ్జాల సామ్రాజ్యాన్ని నెలకొల్పాడు. ఈ విషయమై స్థానికులు ఈ మధ్యే హైడ్రా ప్రజావాణిలో పిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమీషనర్ ఏవీ.రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి జనవరి 31వ తేదీన సర్వే నిర్వహించి, విచారణ చేపట్టారు. ఈ విచారణలో కబ్జాదారులు సైతం పాల్గొన్నారని. కబ్జాదారుల సమక్షంలోనే రెవెన్యూ అధికారులు మొండికుంట చెరువుతో పాటు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని తేల్చి చెప్పారని హైడ్రా అధికారులు తెలిపారు. దాదాపు 11 ఎకరాల మేర రబ్జా చేసి సదరు భూమిలో భారీ షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ఈ నిర్మాణాల్లో దాదాపు 40 వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, వ్యాపార కేంద్రాలు కొనసాగుతుండగా, కబ్జాదారులు ఈ దుకాణాల నుంచి నెలనెలా దాదాపు 40 లక్షల రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నట్లు విచారణలో తెలుసుకున్నారు. ఈమేరకు కబ్జాదారులకు కొంత సమయం ఇచ్చిన హైడ్రా శుక్రవారం యాక్షన్ కు దిగింది. మొండికుంట చెరువు కబ్జా స్థలంతో పాటు ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను జేసిబిలతో కూల్చివేసి నేలమట్టం చేశారు. హైడ్రా స్వాదీనం చేసుకున్న స్థలం దాదాపు 2200కోట్ల విలువ ఉంటుందని, మొత్తం 11 ఎకరాల విస్తీర్ణంలో కూల్చివేతలు చేపట్టినట్లు హైడ్రా కమీషనర్ తెలిపారు. కోర్టులో కేసు కొనసాగుతున్నా అక్రమ నిర్మాణాలు చేపట్టారని అన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన దేవాలయాన్ని, కొన్ని చిన్నచిన్న దుకాణాలను కూల్చివేతల నుంచి మినహాయించినట్లు పేర్కొన్నారు. హైడ్రా కూల్చివేతలపై స్థానికులు భారీ ఎత్తున అక్కడికి చేరుకొని హర్షం వ్యక్తం చేశారని అన్నారు. కబ్జాలు తొలగించిన మొండికుంట చెరువును అభివృద్ధి చేయడంతో పాటు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలంలో పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారని హైడ్రా అధికారులు తెలిపారు.

# పవన్ తో బాలయ్య భేటీ
## .. ఎకో పార్క్ అభివృద్ధికి నిధులపై చర్చ





అలాగే సోమందేపల్లి నుంచి తూముకుంట వరకు నాలుగు వరుసులు రహదారి ఏర్పాటు కు సంబంధించి ఆర్ అండ్ బి రహదారుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో సమావేశమై వెంటనే పనులు ప్రారంభించెల చూడాలన్నారు. డానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరగా చెపట్టాలని కోరారు. అలాగే చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద పారిశ్రామిక వాడ అభివృద్ధికి పరిశ్రమలు త్వరగా వచ్చేలా చూడాలని ఆ శాఖ మంత్రి టీజీ భరత్ ను కోరారు... గొల్లపల్లి నుంచి మడకశిర కి వెళ్లే హంద్రీనివా మడకశిర బ్రాంచ్ కెనాల్ కాలవను వెడల్పు చేయడానికి నిధులు త్వరగా ఇవ్వాలని మంత్రి రామనాయుడుకు నివేదించారు. అలాగే మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు మున్సిపల్ కార్యాలయం నూతన భవన నిర్మాణంకు నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తో పాటు, నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి ఏ వీరయ్యలు ఉన్నారు

--డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కు ఫోన్

పవన్ కళ్యాణ్ తో బాలయ్య భేటీ అయిన అనంతరం డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు ఫోన్ చేసి హిందూపురం నియోజకవర్గ సంబంధించిన పంచాయతీరాజ్, అటవీ శాఖ సంబంధించిన పనులపై ఆరాధిశారు, సూరప్పకుంట లో ఎకో పార్కు అభివృద్ధి సంబంధించిన నివేదికలు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని మునిసిపల్ కమిషనర్ మల్లికార్జునను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు
## .. తెలంగాణలోనూ అప్పుడే: సీఎం రేవంత్‌రెడ్డి



సింగరేణికి కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువ. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు. మెత్తగా ఉన్నానని.. కిషన్‌రెడ్డి నన్ను మాత్రమే ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప.. శత్రువులు లేరు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖ రాసి 6 నెలలు అయ్యింది. దీనిపై కేంద్రం ఇంత వరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తాం'' అని సీఎం తెలిపారు.

# తెలంగాణ పంచాయతీలకు శుభవార్త
## ... కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల



ఈ కబురు; తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది. ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి.

# రేవంత్ రెడ్డికి విద్యార్థుల సమస్యలపై సమీక్షించే
## తీరిక లేకపోవడం సిగ్గుచేటు : హరీశ్ రావు



నిత్యం గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గురుకులాల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై సమీక్షించే తీరిక లేకపోవడం విచారకరమన్నారు.

ఉస్మానియాకు వెళ్లి రిబ్బన్లు కట్ చేయడం తప్ప రెండున్నరేండ్లుగా చేసిన అభివృద్ధి ఏముంది? అని ప్రశ్నించారు. మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటది అనడానికి ముఖ్యమంత్రి పర్ఫెక్ట్ ఉదాహరణ అని ఎద్దేవ చేశారు.రాష్ట్ర అభివృద్ధి కోసమే అంటూ ఇప్పటి వరకు 62 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి సాధించిదేమిటో మొన్నటి కేంద్ర బడ్జెట్ తోనే తేటతెల్లమైందని విమర్శించారు. ఒకవైపు గురుకులాల ఖ్యాతిని మసకబార్చిన రేవంత్ రెడ్డి, మరో వైపు అంచనాలు పెంచి కమీషన్లు దండుకోవడానికే యంగ్ ఇండియా స్కూల్స్ పేరిట భారీ నాటకానికి తెరతీసిండని ఆరోపించారు.కూట్లో రాయి తీయలేనోడు, ఏట్లో రాయి తీస్తడట అన్నట్లు ఉన్న గురుకులాల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టలేని ప్రభుత్వం, అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పురుగుల్లేని అన్నం కోసం విద్యార్థులు నడిరోడ్డెక్కి నిరసన తెలియచేయాల్సిన దుస్థితి కల్పించడమేనా ఇందిరమ్మ రాజ్యం?ఉస్మానియా విద్యార్థులు, తల్లిదండ్రులకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అవమానించడమేనా మీ ప్రజాపాలన?రేవంత్ రెడ్డి పరిపాలన అంటే ప్రగల్భాలు పలకడం కాదు. ప్రతిపక్షాలపై బూతుల వర్షం కురిపించడం అంతకంటే కాదు.హార్వార్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి వెళ్లి వచ్చినా కూడా.. మీరు విద్య పట్ల, విద్యార్థుల పట్ల ప్రాధాన్యం చూపకపోవడం శోచనీయం.ఇప్పటికైనా విద్యాశాఖ మీద దృష్టి సారించి, గురుకుల విద్యార్థులకు పురుగుల్లేని భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

# 3వ తరగతి నుంచే
## విద్యార్థులకు ఏఐ యాక్సెస్



దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం దిల్లీలో జరిగిన ఏఐ కాంక్లేవ్2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐ (AI) రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు పూర్తిగా నిమగ్నమయ్యాయన్నారు. ప్రస్తుతం ఏఐ యాంత్రిక మేధస్సుతో పాటు మనుషుల భావోద్వేగాలను కూడా అర్థం చేసుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గొప్ప విజయమని అభివర్ణించారు. ఈ సమావేశానికి ముందు దిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన ఎడ్‌టెక్ ఏఐ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 10 వినూత్న భారతీయ ఎడ్‌టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో ఆయన సమావేశమయ్యారు.

# 18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి

# .. కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్



**ఈ కబురు, హైదరాబాద్:**

202526 సీజన్‌లో వానాకాలం పంటకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీని కోరారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు.. కేంద్రమంత్రిని కలిసి విజ్ఞప్తిచేశారు. ‘‘వానాకాలం పంటకు సంబంధించి కేంద్రం 53.73 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణకు మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ రాష్ట్రంలో భారీగా పంట దిగుబడులు రావడంతో అదనంగా 18 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి వచ్చింది. అందువల్ల 10శాతం నూకతో సహా ఎఫ్‌సీఐ తీసుకోవాలి. 202425 యాసంగి పంటకు సంబంధించి 5శాతం నూకతో ఇప్పటికే అనుమతిచ్చినదానికి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతివ్వాలి. 202425 వానాకాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ ఫిబ్రవరి 28వ తేదీవరకు గడువు నిర్దేశించారు. కానీ దాన్ని మరో రెండునెలలు పొడిగించాలి’’అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రికి విజ్ఞప్తిచేశారు.

# ఏటీఎంలో డబ్బు నింపేందుకు వచ్చి వాహనం, డబ్బుతో డ్రైవర్ పరారీ

**రూ.57లక్షలతో ఉడాయించిన డ్రైవర్**

**ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు**


ఈకబురు, శేరిలింగంపల్లి : ఏటీఎంలో డబ్బు నింపేందుకు వాహనంతో పాటు వచ్చిన డ్రైవర్ తెలివిగా సిబ్బందికి మస్కా కొట్టి వాహనం, వాహనంలో ఉన్న డబ్బుతో ఉడాయించాడు. యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో డబ్బు నింపేందుకు వచ్చిన సిబ్బంది ఏటీఎం లోపల ఉండగా, సెక్యూరిటీ గార్డు కళ్లుగప్పి వాహనంలో ఉన్న 57 లక్షల రూపాయల డబ్బుతో వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపనపల్లిలో సంఘటన చోటుచేసుకోగా, వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు గోపన్ పల్లికి కొద్దిదూరంలో వ్యాన్ ను గుర్తించారు. కాగా అందులో ఉన్న నగదును తీసుకొని డ్రైవర్ పరారు కాగా, నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...

తిరుమలగిరిలోని సిఖ్ రోడ్డుకు చెందిన బడిగే అజిత్ కుమార్ అలియాస్ శివ గత 6 నెలలుగా సంఘం సెక్యూరిటీ సొల్యూషన్స్ లో పనిచేస్తూ యాక్సిస్ బ్యాంకులో డబ్బు నింపే సీఎంఎస్ వ్యాన్ కు డ్రైవర్ గా కొనసాగుతున్నాడు.. కాగా శుక్రవారం సికింద్రాబాద్ బ్రాంచ్ నుంచి టిఎస్10 యూడి 0393 వ్యాన్ లో డ్రైవర్ అజిత్ కుమార్ వాహనం నడువుతుండగా, కస్టోడియన్లు ఎస్.రామక్రిష్ణ. ఎండి. మాలిక్, సెక్యూరిటీ గార్డు పెరుమాళ్లులు బయలుదేరారు. వీరు మొత్తం 9 ఏటీఎంలలో డబ్బు నింపాల్సి ఉండగా, సాయంత్రం వరకు 8 ఏటీఎంలలో డబ్బు నింపారు. చివరిదైన గోవన్ పల్లి ఏటీఎంలో డబ్బు నింపేందుకు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గోపన్ పల్లికి వచ్చారు. కాగా కష్టోడియన్లు రామక్రిష్ణ మాలిక్ లు వ్యాన్ దిగి ఏటీఎం లోపలికి వెళ్లగా, సెక్యూరిటీ గార్డు పెరుమాళ్లు వాష్ రూమ్ కోసం వ్యాన్ నుంచి బయటకు వచ్చాడు. ఇదే సమయంలో వ్యాన్ లో ఒంటరిగా ఉన్న డ్రైవర్ అజిత్ కుమార్ వ్యాన్ తో సహా అక్కడి నుంచి ఉడాయించాడు. వ్యాన్ లోపల ఏటీఎంలో నింపాల్సిన దాదాపు 57




తెల్లాపూర్ లో పోలీసులు స్వాధీనం చేసుకున్న సీఏంఎస్ వ్యాన్

లక్షల నగదు ఉంది. గోపన్ పల్లి నుంచి సీఎంఎస్ వ్యాన్ తో సహా పారిపోయిన అజిత్ కుమార్ పక్కనే ఉన్న తెల్లాపూర్ వరకు వెళ్లి అక్కడ వ్యాన్ వదిలిపెట్టి, అందులో ఉన్న 57 లక్షల నగదుతో పారిపోయాడు. డ్రైవర్ పారిపోయిన విషయం తెలుసుకున్న కస్టోడియన్లు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసులు అప్రమత్తమై గాలింపు చేపట్టారు. వ్యాన్ ను తెల్లాపూర్ వద్ద పోలీసులు కనుగొన్నారు. అందులో ఉండాల్సిన డబ్బుతో డ్రైవర్ పారిపోయాడు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు అజిత్ కుమార్

## యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో

# మేం పనిచేస్తున్నాం

ఈ కబురు; యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలకు 99 పైసలకు కేటాయించిన భూముల వివరాలు, కుదుర్చుకున్న ఎంవోయూలు, పరిశ్రమల వారీగా భూముల కేటాయింపులు, ధరల వివరాలపై శాసనమండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, డా.పండుల రవీంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 కంపెనీలకు 99 పైసలకు భూమి కేటాయించాం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూములు కేటాయించాం. ఏయే కంపెనీ ఎన్ని ఉద్యోగాలు కల్పించనుందో కూడా ప్రభుత్వ సమాధానంలో పొందుపర్చాం. కాగ్నిజెంట్ కు భూమి కేటాయించినప్పుడు 8వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. కానీ భూమిపూజ సమయంలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఎనర్జీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐఎన్ఐ, ఐటీ అండ్ కామర్స్, ఏపీసీఆర్డీయే, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్, టెక్స్ టైల్, ఎడ్యుకేషన్, హెల్త్ పాలసీల కింద ఆయా సంస్థలకు భూములు కేటాయించడం జరిగింది. ఐదు కంపెనీలకు మాత్రమే 99 పైసలకు భూములు కేటాయించాం.

--పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వాడీవేడి చర్చ

విశాఖలో కోట్లాది రూపాయల విలువైన భూములను 99 పైసలకే ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ధీటుగా సమాధానం ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. హైదరాబాద్ లో రహేజా మైండ్ స్పేస్ కు ఆనాడు 97 ఎకరాలను చంద్రబాబు గారు కేటాయించారు. వారు 21 బిల్డింగ్ ల ద్వారా 10వేల మిలియన్ స్క్వేర్ ఫీట్ నిర్మాణం చేశారు. నేడు ఒక్క మైండ్ స్పేస్ లోనే ఐటీ రంగంలో లక్ష మంది పనిచేస్తున్నారు. అనేక ప్రముఖ కంపెనీలు అక్కడ కొలువుదీరాయి. రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు జీసీసీలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. వారు ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తారు. వారికి పారదర్శకంగా భూములు కేటాయించాం. బెంగళూరులో ఏఎన్ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీ సెంటర్ ను నేను స్వయంగా చూశా. ఈ ఒక్క కంపెనీ 150 జీసీసీలను నిర్మించడం జరిగింది. సుమారు లక్షా 40వేల మంది ఆయా జీసీసీల్లో పనిచేస్తున్నారు. భూముల కేటాయింపు విషయంలో ప్రతి కంపెనీని అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, మంత్రుల సంఘం క్షుణ్ణంగా సమీక్షించడం జరుగుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదంతో భూములను కేటాయించడం జరుగుతుందన్నారు.

--క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూముల కేటాయింపు

గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చారని ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్పే ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు మేం సిద్ధంగా లేం. అంతకుముందు వైసీపీ సభ్యుల తీరును మంత్రి అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. పరిశ్రమలకు భూముల కేటాయింపులపై చర్చకు సిద్ధమని, ప్రశ్నోత్తరాలు గంటలోనే ముగించాలని నిర్ణయం తీసుకున్నందున బీఏసీలో చర్చించి ఈ అంశంపై లఘు చర్చ చేపట్టాలని చెప్పారు. ప్రశ్నకు సంబంధం లేనివి అడగడం వల్ల సమయం వృధా అవుతోందన్నారు.

--భూముల కేటాయింపు విషయంలో వైసీపీ పిల్ పై కోర్టు మొట్టికాయలు వేసింది

మంత్రి లోకేష్ సమాధానం సమాధానం పట్ల వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. టీసీఎస్, కాగ్నిజెంట్, మదర్సన్, రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలకు భూములు ఇవ్వకూడదా అంటూ ప్రశ్నించారు. భూముల కేటాయింపుపై వైసీపీనే కోర్టులో పిల్ వేయించారని, కోర్టు కూడా మొట్టికాయలు వేసిందన్నారు. విశాఖలో రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే 27.1 ఎకరాలను ఎలా కేటాయిస్తారని వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను మంత్రి లోకేష్ ధీటుగా తిప్పికొట్టారు. తాము 5 కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావించినందున ఆధారాలు బయట పెట్టాలని, ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదని సవాల్ చేశారు. లేనిపక్షంలో తమ ప్రకటనను ఉపసంహరించుకోవాలని మంత్రి లోకేష్ పట్టుబట్టారు. ఉర్సాకు తాము ఎలాంటి భూములు కేటాయించలేదని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే పరిశ్రమలకు తక్కువ రేటుకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఉర్సా విషయంలో వైసీపీ సభ్యుల ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

--లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి

వైసీపీ సభ్యుల అరుపులు నేపథ్యంలో మంత్రి లోకేష్ కలుగచేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు వినేందుకు ఓపిక పడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు అరుస్తున్నారు. సమాధానం చెప్పాలా, వద్దా? నేడు దేశానికి వస్తున్న రూ.100 పెట్టుబడుల్లో 25.3 రూపాయలు ఏపీకి వస్తున్నాయన్నారు. వైసీపీ సభ్యులు అరుపులపై స్పందిస్తూ.. లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి. టీం 11 తయారైంది. దీనిపైనా చర్చిద్దామా? 2014 నుంచి 2019 వరకు వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో చూశాం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. అమర్ రాజాను రాష్ట్రం నుంచి తరిమేశారు. ఆర్సెల్లార్ మిట్టల్ ఎక్కడికీ వెళ్లలేదు. వైసీపీ సభ్యులు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. ఆర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు వస్తుంది. మేం భూములు కేటాయించాం. పర్యావరణ అనుమతులు వచ్చాయి. 17 నెలల్లోనే మేం వారిని రాష్ట్రానికి తీసుకువచ్చాం. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ రాబోతోంది. విశాఖలోనే రెండో స్టీల్ ప్లాంట్ ను నిర్మించబోతున్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు కంగారు పడుతున్నారు. అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతాం. మాధవరావు గారికి కొంచెం బీపీ ఎక్కువైంది. బీపీ బిళ్లలు ఇవ్వండి. అప్పుడే కామ్ గా ఉంటారు.

--యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం

ఏపీఐఐసీని కాదని రియల్ ఎస్టేట్ సంస్థలకు ఎందుకు భూములు కేటాయిస్తున్నారని వైసీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. ఆనాడు పశ్చిమ బెంగాల్ లో టాటా నానో ఫ్యాక్టరీని తరిమేశారు. దీంతో ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇస్తామని ఆఫర్ చేయడంతో ఆ ఫ్యాక్టరీని గుజరాత్ కు తీసుకెళ్లారు. దీంతో మొత్తం ఎకో సిస్టమ్ ఏర్పడింది. దానిని ఆదర్శంగా తీసుకుని విశాఖను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. ఏపీఐఐసీ ఎప్పుడూ ఐటీ భవనాలు నిర్మించలేదు. మిలీనియం టవర్స్ ఒక్కటే నిర్మించారు. ఆ భవనాన్ని ఇప్పటికే లీజ్ కు ఇవ్వడం జరిగింది. లీజ్ వల్ల వచ్చే ఆదాయం చాలా తక్కువ. అందుకే భూమిని అభివృద్ధికి ఇవ్వాలని పాలసీగా పెట్టుకున్నాం. యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ప్రభుత్వానికి రెండు రూపాయలు ఆదాయం తగ్గినా పర్వాలేదు.. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు మేం కల్పిస్తాం. ఇది మా విధానం. ఆదాయం ఎక్కువ కావాలనుకుంటే అది మీ పాలసీ. ఉద్యోగాల కల్పన అనేది మా ప్రభుత్వ పాలసీ. 175 నియోజరవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ లను అభివృద్ధి చేస్తాం. ప్రైవేట్ పార్క్ లను కూడా ప్రోత్సహిస్తాం. సత్వా గ్రూప్ విషయానికి వస్తే.. ఒక్కసారి హైదరాబాద్ వెళ్లి చూడాలి. ఇవన్నీ క్రెడిబులిటీ ఉన్న కంపెనీలు. ఐదారు రాష్ట్రాల్లో అభివృద్ధి చేస్తున్నారు. గ్రేడ్ఏ ఐటీ ఆఫీస్ కార్యాలయాలు నిర్మిస్తారు. దీంతో ఎకో సిస్టమ్ ఏర్పడుతుంది. అప్పుడే జీసీసీలు వస్తాయి. విశాఖలో గ్రేడ్ఏ ఐటీ ఆఫీస్ స్పేస్ లేదు.

--భూముల కేటాయింపుల విషయంలో కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు

వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కాలేదు. బొత్స గారికి అదొక ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వచ్చి ఆ తలుపు నుంచి వెళతారు. మేం చాలా పారదర్శకంగా భూ కేటాయింపులు చేశాం. వారి దగ్గర నుంచి ఏం తీసుకున్నారని ఆరోపించారు. నన్ను విమర్శించాలనుకుంటే ఒక్క విషయంలో విమర్శించవచ్చు. నేను బాంబే హౌస్ కు వెళ్లాను. టాటా సన్స్ ఛైర్మన్ చంద్ర ఒకసారి కలవాలని చెప్పారు. నేను బాంబే హౌస్ కు వెళ్లాను. బాంబే హౌస్ లో కప్ టీ ఇచ్చారు. నన్ను విమర్శించాలనుకంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. నో ప్రాబ్లమ్. కాగ్నిజెంట్ విషయంలో కూడా నన్ను విమర్శించవచ్చు. వాళ్లు నాకు ఓ కప్ కేక్ ఇచ్చారు. దావోస్ లో వారి ఆఫీసుకు వెళ్లినప్పుడు ఆ రోజు నా పుట్టినరోజు. వారు మర్యాదపూర్వకంగా కప్ కేక్ లో క్యాండిల్ పెట్టి నాతో బ్లో చేయించారు. సింపుల్. అంతేగానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యం. మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక్క కియా పరిశ్రమ వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయి. క్లస్టర్ విధానంలో మేం ముందుకు వెళ్తున్నాం. మేం ప్రతి పరిశ్రమను గ్రౌండింగ్ చేస్తాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా నేను సిద్ధమని సవాల్ చేశారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని చెప్పారు.



# రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి



ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్ గాంధీ, భాజపా ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. ‘‘రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు..? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించాను. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి’’ అని దూబే అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు.

--రాహుల్ ప్రసంగంలోని పదాలు తొలగింపు..?


బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధ్రువీకరణ లేదని పేర్కొన్నాయి.

# కార్మికుల కష్టంతోనే ఈ దేశం నడుస్తోంది



కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో, ఆర్టీసీ యూనియన్లు, వివిధ వర్గాల కార్మికులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు బంద్‌లో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. వీఎస్టీ నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ‘‘కార్మికుల చెమట కష్టంతో ఈ దేశం నడుస్తోంది. కార్మికుల పరిపూర్ణమైన హక్కులను ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు కార్మికులు ధర్నా చేస్తున్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్టుబడి వ్యవస్థకు దారులు తెరిచింది. మోదీ, అమిత్ షాలను కేంద్రంలో రాహుల్ గాంధీ ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. పేదల హక్కులను కాలరాయడమే కాకుండా.. నరేగా ఉపాధి హామీకి పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆ చట్టాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. నాలుగు కోడ్‌ల రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి. ప్రధాని మోదీ దిగొచ్చి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం కొనసాగాలి’’ అని మహేశ్ గౌడ్ అన్నారు.

# ఏ అధికారంతో కూల్చివేతలు చేపట్టారు!



**–ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు**

**–కంచె తొలగించాలంటూ హైడ్రాకు హైకోర్టు ఆదేశం**

**ఈ కబురు, హైదరాబాద్:**

కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో ఆక్రమణలను ఏ అధికారంతో తొలగించారని హైడ్రాను హైకోర్టు నిలదీసింది. ఆక్రమణల నిరోధంలో హైడ్రా చర్యలు అభినందనీయమే కానీ సహజ న్యాయసూత్రాలను పాటించడం తప్పనిసరని తెలిపింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగ్‌లోని సర్వే నం.300 నుంచి 303, 306 నుంచి 311, 313 నుంచి 315 వరకు 1,608 చదరపు గజాల స్థలంలోని పలు ప్లాట్లకు ఉన్న కాంపౌండ్‌ను కూల్చివేసి కంచె వేయడాన్ని సవాల్ చేస్తూ గొర్ల రాహుల్‌యాదవ్ మరో ఏడుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎ.రవీందర్‌రెడ్డి, న్యాయవాది పి.పంకజ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ స్థలానికి సంబంధించి దాఖలైన పిటిషన్‌లో పిటిషనర్ల హక్కులను ధ్రువీకరిస్తూ కింది కోర్టు తీర్పు వెలువరించిందని, దీనిపై అధికారులు దాఖలుచేసిన అప్పీలు పెండింగ్‌లో ఉందన్నారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కాంపౌండ్ తొలగించి కంచె వేసి బోర్డు పెట్టారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఏ అధికారంతో కూల్చివేశారని ప్రశ్నించగా.. హైడ్రా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ జరిగిందని హైడ్రా దృష్టికి వచ్చినా, మౌఖికంగా ఫిర్యాదు అందినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వాదనతో న్యాయమూర్తి విభేదిస్తూ ఆక్రమణదారులైనా నోటీసు ఇవ్వడం తప్పనిసరన్నారు. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి నుంచి ఎలాంటి అనుమతి పొందకుండా ఏకపక్షంగా కంచె వేయడానికి వీల్లేదన్నారు. దాన్ని తొలగించి, ఆదేశాల అమలు నివేదికను కోర్టుకు సమర్పించాలంటూ విచారణను ఈ నెల 24కు వాయిదా వేశారు.

# లక్షల కార్లను రీకాల్ చేసిన బీఎండబ్ల్యూ




జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ (BMW) ప్రపంచవ్యాప్తంగా లక్షల కార్లను రీకాల్ చేసింది. ఇంజిన్ స్టార్టర్లలో నెలకొన్న సాంకేతిక సమస్యతో నిప్పు రాజుకొనే ప్రమాదం ఉండటంతో ఈ రీకాల్ చేస్తున్నట్లు ఆ సంస్థ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

2020-2022 మధ్య ఉత్పత్తి చేసిన 16 మోడళ్లలో ఈ సమస్య ఉన్నట్లు ప్రతినిధి తెలిపారు. వివిధ మోడల్స్‌కు చెందిన దాదాపు 5,75,000 వాహనాలపై ఈ ప్రభావం ఉంటుందని అంచనా. ఈ మోడల్ వాహనాల్లో స్టార్టర్ మోటార్ వ్యవస్థలో సాంకేతిక లోపాలు ఉన్నాయని ఉత్పత్తి తనిఖీలు, కస్టమర్ల నుంచి వచ్చిన ఫిర్యాదుల ద్వారా వెల్లడైందని బీఎండబ్ల్యూ పేర్కొంది. ఎక్కువసార్లు స్టార్ట్ చేయడానికి ప్రయత్నిస్తే అందులోని మాగ్నెటిక్ స్విచ్‌లు అరిగిపోవడంతో.. కారు స్టార్ట్ అవడం కూడా కష్టతరం అవుతుందని వెల్లడించింది. కొన్ని సందర్భాల్లో ఇది వాహనంలో మంటలు చెలరేగడానికి దారితీయొచ్చని పేర్కొంది.

# మార్కెట్‌కు ఐటీ షాక్.. ₹3 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. అమెరికాలో జనవరి నెలకు సంబంధించి అంచనాల కంటే మెరుగైన జాబ్స్ డేటా రావడం మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. మెరుగైన జాబ్స్ డేటా వల్ల ఇప్పట్లో ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికితోడు ఐటీ షేర్లను ఏఐ భయాలు వెంటాడాయి. ఇటీవల వరుస లాభాల వేళ గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ సూచీలపై ఒత్తిడి పడింది.

ఐటీ స్టాక్స్‌ను ఆంత్రోపిక్ భయాలు ఇంకా వెంటాడుతున్నాయి. దీనికితోడు అమెరికాలో వెలువడిన జాబ్స్ డేటా కూడా ఐటీ షేర్లపై ప్రభావం చూపింది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోతే అమెరికన్ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన ఐటీ కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయి. ఈ నేపథ్యంలో నేడు ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ వంటి షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 5 శాతం మేర పతనమైంది. బీఎస్‌ఈలో మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు క్షీణించింది. సెన్సెక్స్ ఉదయం 83,968.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,233.64) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 83,516.67 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 558.72 పాయింట్ల నష్టంతో 83,674.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 146.65 పాయింట్ల నష్టంతో 25,807.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5064 డాలర్ల వద్ద ట్రేడవుతోంది

# ఫుడ్ డెలివరీలోకి ఫ్లిప్‌కార్ట్.. స్విగ్గీ, జొమాటో స్టాక్స్ లో కుదుపు!



వాల్‌మార్ట్‌కు చెందిన ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ (Flipkart) మరో కొత్త వెంచర్‌లోకి అడుగుపెట్టబోతోంది. ఇప్పటికే మినిట్స్ పేరుతో క్విక్ కామర్స్ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ సంస్థ.. ఫుడ్ డెలివరీ విభాగంలోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ రంగంలో స్విగ్గీ, జొమాటోలదే హవా. ఫ్లిప్‌కార్ట్ ఎంట్రీ ఇస్తోందన్న వార్తల నేపథ్యంలో ఈ రెండు కంపెనీల షేర్లు గురువారం ప్రభావితమయ్యాయి. ఈ ఏడాది మే-జూన్ మధ్య బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు ఫ్లిప్‌కార్ట్ సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'ఎకనామిక్ టైమ్స్' ఓ కథనం ప్రచురించింది. ఈ ఏడాది చివర్లో గానీ, వచ్చే ఏడాదికల్లా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా కంపెనీ ఆలోచన చేస్తోంది. స్విగ్గీ, జొమాటో తరహాలో స్టాండలోన్ ప్లాట్‌ఫామ్‌ను నెలకొల్పాలా? లేదా ప్రభుత్వ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఓఎన్‌డీసీలో బయ్యర్ సైడ్ అప్లికేషన్‌ను ఏర్పాటుచేయాలా? అనే ఆప్షన్లను ప్రస్తుతం పరిశీలిస్తోందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారు. దీనిపై ఫ్లిప్‌కార్ట్ అధికారికంగా స్పందించలేదు.

ప్రస్తుతం ఫుడ్ డెలివరీ విభాగంలో కొన్నేళ్లుగా స్విగ్గీ, జొమాటో రాజ్యమేలుతున్నాయి. ఈ రంగంలోకి రావడానికి కొన్ని కంపెనీలు ప్రయత్నించినా అవేవీ పెద్దగా సఫలం కాలేదు. ఈ నేపథ్యంలో వాల్‌మార్ట్ వంటి పెద్ద సంస్థ అండ ఉన్న ఫ్లిప్‌కార్ట్ ప్రవేశించబోతోందన్న వార్తలు ఈ కంపెనీల షేర్లపై ప్రభావం చూపాయి. జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ షేరు విలువ 2 శాతం మేర పతనమై రూ.291.40 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత కోలుకుంది. స్విగ్గీ షేరు విలువ కూడా ఓ దశలో 3 శాతానికి పైగా నష్టంతో రూ.328 వద్ద కనిష్ఠాన్ని తాకింది. గతంలో క్యాబ్ సేవల సంస్థ ర్యాపిడో కూడా ఫుడ్ డెలివరీ విభాగంలోకి అడుగుపెడుతోందన్న వార్తలతో ఈ రెండు సంస్థల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

# నాకు వాట్సప్ చేయండి: మాజీల నుంచి 8 వేల ఈ-మెయిల్స్‌పై దీపిందర్ గోయల్



జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ లిమిటెడ్ (Eternal ltd) మాజీ సిబ్బంది నుంచి వచ్చిన అనూహ్య స్పందన తనను ఉద్వేగానికి గురిచేసిందని వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ అన్నారు. back@eternal.com ప్రోగ్రామ్ కింద ఆయన మాజీ ఉద్యోగులను మరోసారి సంస్థలోకి ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటన తర్వాత కొన్ని రోజుల్లోనే 8000 మెయిల్స్ వచ్చాయి. దీనిపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "గత వారం రోజుల్లో 8000 మెయిల్స్ వచ్చాయి. అందులో నాలుగువేల మంది ఏదోఒక దశలో ఎటర్నల్‌లో భాగమైనవారే. మిగతావారు సంస్థలో పని చేయలేదు కానీ.. ఇప్పుడు భాగం కావాలని అనుకుంటున్నారు. ఈ స్పందనకు కృతజ్ఞతలు. ఇది నేను ఊహించలేదు. వాటిలో నాకు నిజాయతీ, ఉద్వేగాలు కనిపించాయి. ఎన్నోఏళ్ల క్రితం సంస్థను వీడిన వారి గురించి ప్రస్తుత సిబ్బందికి తెలిసే అవకాశం చాలా తక్కువ. అందుకే వాటన్నింటిని చదివి, ఏ రిప్లై ఇవ్వాలో తెలిసిన వ్యక్తిని నేను. అయితే అవి చదవడం నాకు అసాధ్యమే. ప్రతి మెయిల్‌ను పరిశీలిస్తున్నానని, అందుకు సమయం పడుతుందని చెప్పారు. మీరు గతంలో నేరుగా నాతో పనిచేసి ఉన్నవారైతే.. సమాధానం కోసం ఎదురుచూస్తుంటే.. నా నంబర్‌కు వాట్సప్ చేయండి" అని ఎక్స్ వేదికగా గోయల్ (Deepinder Goyal) పోస్టు పెట్టారు. ఇదిలాఉంటే.. దీపిందర్ గోయల్ తన సీఈఓ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో బ్లింకిట్ సీఈఓగా ఉన్న అల్బీందర్ దిండ్సా బాధ్యతలు చేపట్టారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ఈ మార్పులు అమల్లోకి వచ్చాయి.

# మన వస్త్ర పరిశ్రమకూ బంగ్లా మాదిరి ప్రయోజనాలు: పీయూష్ గోయల్



దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో బంగ్లాదేశ్ మాదిరిగానే మన వస్త్ర పరిశ్రమకూ ప్రయోజనాలు లభిస్తాయని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ అన్నారు. అమెరికా నూలు, పత్తిని దిగుమతి చేసుకుని వస్త్రాలు తయారుచేసి ఆ దేశానికి తిరిగి ఎగుమతి చేసే విషయంలో రెండు దేశాలకు ఒకే తరహా ప్రయోజనాలను కల్పిస్తారని పేర్కొన్నారు. అమెరికా ఒత్తిడులకు తలొగ్గి వస్త్ర పరిశ్రమను తాకట్టుపెట్టారంటూ విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన నేపథ్యంలో మంత్రి ఈ అంశంపై స్పందించారు.

బంగ్లాదేశ్ అమెరికా మధ్య ఇటీవల వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా బంగ్లాదేశ్‌పై ప్రతీకార సుంకాలను అగ్రరాజ్యం 19 శాతానికి తగ్గించింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న పత్తి లేదా కృత్రిమ నూలు ఉపయోగించి బంగ్లాదేశ్‌లో తయారు చేసిన దుస్తులు, వస్త్రాలపై జీరో ట్యాక్స్ వర్తిస్తుంది. బంగ్లాదేశ్‌లో తయారయ్యే సాధారణ వస్త్రాలపై 31 శాతం (మోస్ట్ ఫేవర్డ్ నేషన్ 12 శాతం+ ప్రతీకార సుంకం 19 శాతం) వర్తిస్తుంది. ఆ వస్త్రాల తయారీలో అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న ముడిసరకు ఉంటే ప్రతీకార సుంకం నుంచి మినహాయింపు లభించి 12 శాతం మాత్రమే సుంకం పడుతుంది.

బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమకు అమెరికా కల్పిస్తున్న ఈ ప్రయోజనాల తరహాలోనే భారత వస్త్ర పరిశ్రమకు తుది ఒప్పందంలో అవే ప్రయోజనాలు లభిస్తాయని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఒక భారతీయ కంపెనీ అమెరికా నుంచి నూలు, పత్తిని సేకరించి వస్త్రాలను తయారు చేసి అమెరికాకు తిరిగి ఎగుమతి చేస్తే ఆ వస్త్రాలు బంగ్లాదేశ్ సంస్థల మాదిరిగానే అమెరికాలో కూడా సుంకాల నుంచి మినహాయింపు పొందుతాయని వెల్లడించారు. అమెరికాబంగ్లాదేశ్ ఒప్పందంలో ఉన్నదే మన అగ్రిమెంట్‌లోనూ ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల దేశ పత్తి రైతులపై ఎలాంటి ప్రభావం పడబోదని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలతో 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నామని, దీనివల్ల భారత్‌కు విస్తృత మార్కెట్ యాక్సెస్ లభిస్తుందని పేర్కొన్నారు.

# అమెరికా వెనెజువెలా నుంచి మరింత చమురు!

అమెరికా, వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచడాన్ని పరిశీలించాల్సిందిగా ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ రిఫైనరీ సంస్థలను ప్రభుత్వం కోరింది. తమతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోలు చేయడాన్ని భారత్ నిలిపి వేయనుందని అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, టెండర్ల ద్వారా స్పాట్ మార్కెట్ నుంచి చమురు కొనుగోలు చేసే సమయంలో అమెరికా గ్రేడ్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం కోరినట్లు రిఫైనరీ వర్గాలు తెలిపాయి. వెనెజువెలా ముడిచమురు విషయంలోనూ ప్రభుత్వం ఇటువంటి సూచనే చేసినట్లు వెల్లడించాయి.

**అధికారిక ప్రకటనైతే లేదు**

రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇంధన భద్రతకు ప్రాధాన్యమిస్తామని, దేశ అవసరాలకు అనుగుణంగా అవకాశం ఉన్న చోట కొనుగోలు చేస్తామనే మనదేశం వెల్లడించింది.

**ఆ చమురు అనుకూలమేనా?**

అమెరికా, వెనెజువెలా చమురు కొనుగోళ్ల విషయంలో భారత రిఫైనరీలకు పరిమితులు ఉన్నాయి. అమెరికా చమురు గ్రేడ్‌లలో తక్కువ గంధకం (సల్ఫర్) ఉంటుంది. అయితే భారత రిఫైనరీలు తమ యూనిట్లను మధ్యరకం చమురును శుద్ధి చేసేందుకు వీలుగా ఏర్పాటు చేశాయి. అందువల్ల అమెరికా చమురు ఎంతవరకు సరిపోతుందో చూడాల్సిందే. దీంతోపాటు చమురు రవాణా ఖర్చులూ అధికమవుతాయి. పశ్చిమ ఆఫ్రికా, కజకిస్థాన్ నుంచి అయితే ఖర్చు తగ్గుతుంది.

**వెనెజువెలా ముడిచమురు నిల్వలను విక్రయించడంపై అమెరికా దృష్టి పెట్టింది. మనదేశం నుంచి ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీలు ఇటీవల 4 మిలియన్ బ్యారెళ్ల వెనెజువెలా ముడిచమురును దిగుమతి చేసుకున్నాయని సమాచారం.**



# అమ్మాయి బ్యూటీని చూసి ఎంజాయ్ చేయండి..

## కానీ కామెంట్ చేయకండి.. నటి దివి షాకింగ్ కామెంట్స్



బిగ్ బాస్ షో ద్వారా ఎంతోమంది ఫేమస్ అయ్యారు. అలా పాపులారిటీ సంపాదించుకుంది వారిలో దివి వడ్త్యా(Divi Vadthya) ఒకరు. అంతకముందు సినిమాల్లో చిన్న చిన్న రోల్ ప్లే చేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాల్లో నటించే స్థాయికి ఎదిగింది. మెయిన్‌గా సోషల్ మీడియాలో నెట్టింట బోల్డ్ డ్రెస్సులతో రచ్చ చేస్తూ ఉంటుంది ఈ అమ్మడికి ఫాలోవర్స్ కూడా చాలా ఎక్కువ మందే ఉన్నారు. అయితే రీసెంట్‌గా ఈ భామ నవీన్ చంద్ర(Naveen Chandra) నటించిన 'హనీ'((Honey) సినిమాలో ఈ చిన్నది కూడా నటించింది.'పలాస' చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కరుణ కుమార్(Karuna Kumar), వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌ను రూపొందించారు. ఇక ఇందులో దివ్య పిళ్లై, రాజా రవీంద్ర, మీరా వంటి వారు కీరోల్ ప్లే చేశారు. అయితే ఈ భారీ అంచనాల నడుమ రిలీజ్ అయిన ఈ చిత్రం మంచి విజయం సాధించింది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దివి వడ్త్యా షాకింగ్ కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'మనం బయట వేరే కంట్రీకి వెళ్లినప్పుడు, లేకపోతే వేరే ప్లేస్‌లో ఉన్నప్పుడు, బీచ్‌లో ఉన్నప్పుడు ఎలాంటి అవుట్ ఫిట్ వేసుకుంటావో వేసుకో. నువ్వు గుడికి వెళ్లినప్పుడు సంప్రదాయకంగా వెళ్లు. ఇప్పుడు నేను ఇంటర్వ్యూకు వచ్చా.. ఎలా రావాలో అలా వచ్చా.. అన్నీ కనిపించేలా విప్పుకొని రాలేగా. నేను చాలా మందిని చూశాను మన ఏజ్ వాళ్ళే అవ్వా నువ్వేంటి ఇలాంటి డ్రెస్సులు వేసుకున్నావు, నువ్వు ఇలాంటి బట్టలు వేసుకుంటే ఎవరు నిన్ను పెళ్లి చేసుకుంటాడు, అని కృశ్చన్ చేస్తారు. నిజంగా అది నాకు షాకింగ్‌గా అనిపిస్తుంది. గాయ్స్ మీరు చేంజ్ అవ్వండి అమ్మాయి బ్యూటీని చూసి ఎంజాయ్ చేయండి.. కానీ కామెంట్ చేయకండి' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.





# లేటు వయసులో పెళ్లి చేసుకోవడం పై నటుడు సుబ్బరాజు స్పందన

- లేటు పెళ్లిళ్లు, విడాకులపై సుబ్బరాజు ఆసక్తికర వ్యాఖ్యలు
- నీకు ఏదో వస్తుందని చేసుకునేది పెళ్లి కాదన్న సుబ్బరాజు
- తన భార్యకు అన్నీ ఇవ్వగలననే నమ్మకం వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకున్నానని వెల్లడి

క్యారెక్టర్ ఆర్టిస్టుగా టాలీవుడ్ లో నటుడు సుబ్బరాజు తనదైన ముద్ర వేశారు. 'బాహుబలి 2' ద్వారా దేశ వ్యాప్తంగా కూడా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. నటుడిగా బిజీగా ఉన్న సుబ్బరాజు... చాలా లేటుగా పెళ్లి చేసుకున్నారు. గత ఏడాది నవంబరులో సడెన్ గా పెళ్లి చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... పెళ్లిళ్లు లేటుగా ఎందుకు చేసుకుంటున్నారు? విడాకులు ఎందుకు పెరుగుతున్నాయి? అనే విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

చాలామంది ఇంట్లో వాళ్ల ఒత్తిడితోనో, లేదా వయసు పెరిగిపోతోందనో పెళ్లి చేసుకుంటారని సుబ్బరాజు అన్నారు. ఇది కరెక్ట్ కాదని చెప్పారు. నీకు ఏదో వస్తుందని చేసుకునేది పెళ్లి కాదు... నీ భాగస్వామికి నీవు ఏమి ఇవ్వగలవనే దానిపై నీ పెళ్లి ఆధారపడి ఉండాలని అన్నారు. భాగస్వామిపై పెట్టుకునే భారీ అంచనాలే పెళ్లిళ్లు పెటాకులు కావడానికి కారణమని చెప్పారు. తన భార్య అలా ఉండాలని, తన భర్త అలా ఉండాలని ఊహించుకుంటారని, పెళ్లయిన తర్వాత వాస్తవం అలా లేకపోతే మనస్పర్థలు మొదలవుతాయని అన్నారు. తన భార్యకు తన సర్వస్వం ఇవ్వగలను అని నమ్మకం వచ్చిన తర్వాతే తాను పెళ్లి చేసుకున్నానని చెప్పారు.



# ఉస్తాద్ భగత్ సింగ్' అప్డేట్స్ పై హరీశ్ శంకర్ కీలక వ్యాఖ్యలు



**పవన్, హరీశ్ శంకర్ కాంబోలో 'ఉస్తాద్ భగత్ సింగ్'**
**సినిమా గురించి అప్డేట్స్ రావడం లేదని అభిమానుల్లో నిరాశ**
**త్వరలోనే అన్ని అప్డేట్స్ ఇస్తామన్న హరీశ్ శంకర్**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ – క్రేజీ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబో అంటే టాలీవుడ్‌లో అత్యంత ఎక్స్‌పెక్టేషన్ కలిగిన కాంబినేషన్లలో ఒకటి. 'గబ్బర్ సింగ్'తో ఈ కాంబో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'తో మళ్లీ ప్రభంజనం సృష్టించేందుకు వీరు రెడీ అవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌కు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. మార్చి 26న ఈ సినిమా విడుదల కాబోతోంది.
మరోవైపు, చాలా కాలంగా సినిమా గురించి అప్డేట్ రావడం లేదన్న నిరాశతో ఉన్న పవన్ అభిమానులు సోషల్ మీడియాలో హరీశ్ శంకర్‌ను ట్యాగ్ చేసి ప్రశ్నలు గుప్పిస్తున్నారు. వందల సంఖ్యలో వస్తున్న పోస్టులపై హరీశ్ శంకర్ తాజాగా స్పందించారు. అభిమానుల ఆత్రుతను తాను పూర్తిగా అర్థం చేసుకుంటున్నానని, కానీ ప్రతి అప్డేట్ కు సరైన సమయం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.
"మమ్మల్ని నమ్మండి... సెలబ్రేషన్స్ లోడింగ్... త్వరలోనే అన్ని అప్‌డేట్స్ ఇస్తాం. సినిమా నిర్మాణం వెనుక ఎంతో కష్టం ఉంటుంది. దయచేసి అర్థం చేసుకోండి. మేము ఇచ్చే ప్రతి అప్‌డేట్‌ను మీరు ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటారు" అని పోస్ట్ చేశారు.



# పేరు మారిస్తేనే విడుదల.. మనోజ్ బాజ్‌పేయి చిత్రంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు


మనోజ్ బాజ్‌పేయి తాజా సినిమా 'ఘూస్‌ఖోర్ పండత్' (Ghooskhor Pandat) చిత్ర బృందంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమా పేరు మార్చిన తర్వాతే విడుదలకు అనుమతి లభిస్తుందని తెలిపింది. మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో నీరజ్ పాండే, రితేశ్ షా సంయుక్త దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా (Manoj Bajpayee) ఓ వర్గాన్ని కించపరిచేలా ఉందని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో (Supreme Court) నేడు విచారణ జరిగింది. "ఇలాంటి పేర్లు పెట్టి సమాజంలో ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపే అధికారం ఎవరికీ లేదు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మీరు దీని పేరును మార్చాలి. కొత్త టైటిల్‌ను కోర్టుకు తెలిపిన తర్వాతే విడుదలకు అనుమతి లభిస్తుంది" అని సుప్రీంకోర్టు తెలిపింది. దీనితోపాటు ఈ సినిమాలో ఏ వర్గాన్నీ కించపరచడం లేదని అఫిడవిట్ దాఖలు చేయాలని దర్శక-నిర్మాతలను ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణ ఫిబ్రవరి 19కి వాయిదా పడింది.నెట్‌ఫ్లిక్స్ (Netflix) వేదికగా 'ఘూస్‌ఖోర్ పండత్' స్ట్రీమింగ్ కానుంది. ఇందులో మనోజ్ బాజ్‌పేయి.. అజయ్ దీక్షిత్ అనే అవినీతి పోలీసు అధికారి పాత్రలో కన్పించనున్నారు. అయితే సినిమా పేరు, మనోజ్ పాత్రను రూపొందించిన తీరుపై తీవ్ర దుమారం రేగింది. ఆ పేరు, స్టోరీ లైన్ తమ వర్గాన్ని కించపరిచేలా ఉందని దర్శకుడిపై బ్రాహ్మణ సంఘం ఫిర్యాదు చేసింది. సినిమా విడుదల నిలిపివేయాలని కోరుతూ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

# మిమ్మల్ని కూడా హగ్ చేయాలనే వచ్చా.. కానీ.. నరేశ్



హైదరాబాద్: ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత సినిమా వేడుకల్లో మహిళలందరూ చీరలోనే కనిపిస్తున్నారని సీనియర్ నటుడు నరేశ్ (Naresh) అన్నారు. అలా ఉండటం భారతీయ సంస్కృతి అని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన 'హే భగవాన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడారు. ఈ వేడుకలో.. వాలంటైన్ వీక్‌లో భాగమైన 'హగ్ డే' సందర్భంగా టీమ్‌లోని పురుషులను ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపిన నరేశ్.. శివానీ నాగారం, చొక్కారపు ప్రవంతికి కేవలం విషెస్ చెబుతూ వారి వస్త్రధారణను ప్రస్తావించారు. "మిమ్మల్ని కూడా హగ్ చేయాలనే వచ్చా. కానీ, మీరు లక్షణంగా చీరలు ధరించారు. కొన్ని పరిణామాల తర్వాత వేదికలపై చాలామంది చీరల్లోనే కనిపిస్తున్నారు'' అని అన్నారు. సుహాస్ హీరోగా దర్శకుడు గోపి తెరకెక్కించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'హే భగవాన్' (Hey Bhagawan). శివానీ హీరోయిన్. యాంకర్ ప్రవంతి కీలక పాత్ర పోషించారు. సినిమా ఈ నెల 20న (Hey Bhagawan Release Date) విడుదల కానున్న సందర్భంగా ఏర్పాటైన ఈవెంట్‌కు హీరో సాయి దుర్గాతేజ్ (Sai Durgha Tej) ముఖ్య అతిథిగా హాజరై, సినిమా మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు.
"నా 'సుప్రీమ్' సినిమా ప్రమోషన్స్ సమయంలో సుహాస్‌ను చూశా. ఆయన అప్పుడెలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. నరేశ్ అంకుల్ ఎప్పుడూ స్నేహపూర్వకంగా ఉంటారు. ఈ సినిమా మీ అందరికీ వినోదం పంచుతుందని అనుకుంటున్నా'' అని సాయి దుర్గాతేజ్ పేర్కొన్నారు

# ఆ జాబితాలోకి 'ది ప్యారడైజ్'.. కొత్త విడుదల తేదీ వచ్చేసింది




సినిమాని ప్రకటిస్తూనే.. విడుదల తేదీ వివరాలు వెల్లడించడం, అనుకున్న సమయానికి వర్క్ పూర్తి కాకపోవడంతో వాయిదా వేయడం.. టాలీవుడ్‌లో ఇటీవల ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పుడా జాబితాలో 'ది ప్యారడైజ్' (The Paradise) చేరింది. ఈ యాక్షన్ డ్రామా మూవీ ఆగస్టు 21కి (The Paradise new release date) వాయిదా పడింది. భారతీయ భాషలతోపాటు ఇంగ్లిష్, స్పానిష్‌లో రిలీజ్ కానుంది. మార్చి 26న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే (The Paradise Postponed). నాని (Nani) హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రమిది. తమ కాంబినేషన్‌లో ఇంతకుముందు వచ్చిన 'దసరా'ను మించేలా ప్లాన్ చేస్తున్నారు. రెండు జడలతో కూడిన నాని లుక్‌తోపాటు మోహన్‌బాబు, సంపూర్ణేశ్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.
మార్చిలో 'ఉస్తాద్ భగత్‌సింగ్' మార్చి 27న విడుదల కావాల్సిన రామ్‌చరణ్ (Ram Charan) 'పెద్ది' సినిమా ఇప్పటికే పోస్ట్‌పోన్ అయిన సంగతి తెలిసిందే. బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ పీరియాడికల్ స్పోర్ట్స్ యాక్షన్ మూవీ ఏప్రిల్ 30న (Peddi Movie Release Date) రానుంది. మార్చి 26న (Ustaad Bhagat Singh release date) 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను విడుదల చేయనున్నట్లు ఈ చిత్ర బృందం ప్రకటించడంతో.. 'ది ప్యారడైజ్' వాయిదా పడే అవకాశాలున్నాయంటూ జోరుగా ప్రచారం సాగింది. దీంతో, తమ అభిమాన హీరో మూవీ ఎప్పుడొస్తుందోనన్న సందేహంలో ఉన్న నాని అభిమానులకు తాజాగా స్పష్టత వచ్చింది. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీనే 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఇందులో పవన్ కల్యాణ్ పోలీసు అధికారిగా కనిపించనున్నారు.

# గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన జోస్ బట్లర్




ఇంగ్లండ్ వికెట్‌కీపింగ్ బ్యాటర్ జోస్ బట్లర్ తన అసమాన క్యాచింగ్ ప్రతిభతో గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకెక్కాడు. ఇటీవల దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో బట్లర్ 122 మీటర్ల ఎత్తు నుంచి డ్రోన్ ద్వారా వదిలిన బంతిని పట్టుకుని, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన క్యాచ్ పట్టిన వ్యక్తిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ప్రవేశించాడు. బట్లర్‌కు ముందు ఈ ఫీట్‌ను సాధించేందుకు చాలా మంది ప్రయత్నించినప్పటికీ ఎవరి వల్ల కాలేదు. బట్లర్ మాత్రం తన అద్భుతమైన హ్యాండ్‌ఐ కమ్యూనికేషన్‌తో, బంతిపైనే పూర్తి ఏకాగ్రత ఉంచి అద్భుతమైన క్యాచ్‌ను పట్టుకున్నాడు. గతంలో ఈ రికార్డు ఆస్ట్రేలియా వికెట్‌కీపర్ బ్యాటర్ తిమోతి షానన్ జెబ్సీలన్ పేరిట ఉండేది. 2021లో తిమోతి 119.86 మీటర్ల ఎత్తు నుంచి పడ్డ బంతిని పట్టుకుని రికార్డు సృష్టించాడు. తాజాగా బట్లర్ తిమోతి రికార్డును అధిగమించి గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ప్రవేశించాడు. ఈ ఫీట్‌కు క్రికెట్‌తో ఏ సంబంధం లేనప్పటికీ.. ఈ అనుభవం మాత్రం బట్లర్‌కు ఆన్‌ఫీల్డ్ చాలా ఉపయోగపడుతుంది. ఫీల్డింగ్ సమయంలో ఎప్పుడైనా ఇలాంటి పరీక్ష ఎదురైతే బట్లర్ తప్పక సక్సెస్ అయ్యే అవకాశం ఉంటుంది. బట్లర్ ఇప్పటికే ఆన్ ఫీల్డ్‌లో ఇలాంటి ఎన్నో అద్భుతమైన క్యాచ్‌లు పట్టుకున్నాడు. వికెట్‌కీపర్‌గానే కాకుండా ఫీల్డర్‌గానూ పలు మంచి అనుభవాలు కలిగి ఉన్నాడు. తాజా అనుభవం (గిన్నిస్ రికార్డు) మాత్రం బట్లర్‌ను చాలా ప్రత్యేకంగా ఉంచుతుంది. ఈ గిన్నిస్ రికార్డు ఫీట్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరలవుతోంది. ఇదిలా ఉంటే, బట్లర్ ప్రస్తుతం టీ20 ప్రపంచకప్‌లో బిజీగా ఉన్నాడు. ఈ విధ్వంసకర బ్యాటర్ ఇటీవలికాలంలో ఫామ్‌లేమితో సతమతమవుతున్నాడు. ప్రపంచకప్‌లోనూ బట్లర్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. నేపాల్‌తో మ్యాచ్‌లో 26 పరుగులు చేసిన అతను.. నిన్న వెస్టిండీస్‌పై 21 పరుగులకు ఔటయ్యాడు. రెండు మ్యాచ్‌ల్లో బట్లర్‌కు శుభారంభాలే లభించినా, పెద్ద స్కోర్లుగా మలుచుకోలేకపోయాడు. బట్లర్ ఫామ్‌లాగే, మెగా టోర్నీ ఇంగ్లండ్ పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. తొలుత పసికూన నేపాల్ చేతిలో తృటిలో ఘోర పరాభవాన్ని తప్పించుకున్న ఈ జట్టు.. నిన్న విండీస్ చేతిలో ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. ఫలితంగా పాయింట్ల పట్టికలో విండీస్, స్కాట్లాండ్, ఇటలీ తర్వాత నాలుగో స్థానంలో ఉంది.

# క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ



భారత డేవిస్‌కప్ జట్టు మాజీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని... చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో సాకేత్-సిద్ధాంత్ (భారత్) ద్వయం 2-6, 6-1, 10-2తో 'సూపర్ టైబ్రేక్'లో ఎరిక్ వాన్‌షెల్‌బోయిమ్ (ఉక్రెయిన్)-డెనిస్ యెవ్‌సెయెవ్ (కజకిస్తాన్) జంటను ఓడించింది. మరో మ్యాచ్‌లో గంటా సాయికార్తీక్ రెడ్డి-దిగ్విజయ్ సింగ్ (భారత్) జోడీ 4-6, 2-6తో నిక్కీ పునాచా (భారత్)-ప్రుచాయో ఇసారో (థాయ్‌లాండ్) జంట చేతిలో ఓడిపోయింది.

# నయా రాకెట్



**భారత టెన్నిస్‌లో నిశ్శబ్ద చాంపియన్‌గా ఎదిగిన దక్షిణేశ్వర్**
**నెదర్లాండ్స్‌తో డేవిస్‌కప్ పోరులో అసాధారణ ప్రదర్శన**
**బరిలోకి దిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం**
**తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయని చెన్నై ప్లేయర్**

దక్షిణేశ్వర్ సురేశ్... గతేడాదే డేవిస్‌కప్‌లో అరంగేట్రం చేశాడు. తొలి ప్రయత్నంలోనే బోణీ కూడా కొట్టాడు. అయినా మనకెవరికీ తెలియదు. తాజాగా తెలిసింది. తెలియని వారు సైతం తెలుసుకుంటున్నారు. గూగుల్‌లో ఎవరీ దక్షిణేశ్వర్ అని సెర్చ్ చేస్తున్నారు. ఇంతలా నెటిజన్ల కంటపడుతున్న అతను ఏం చేశాడో చెప్పాల్సిన పనైతే లేదు. ఎందుకంటే అతనొక సంచలనం. డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్-1లో నెదర్లాండ్స్ జట్టుతో భారత్ ఆడితే... తలపడింది... ఎదురుపడింది... ఎదుర్కొని గెలిపించింది మాత్రం దక్షిణేశ్వరే! ఇందులో ఏ మాత్రం అతిశయోక్తే లేదు. పోటీ... నైపుణ్యం నిండిన ప్రస్తుత కాలంలో దక్షిణేశ్వర్ ముమ్మాటికి ఓ నిశ్శబ్ద చాంపియన్. జూనియర్ సర్క్యూట్, ఏటీపీ చాలెంజర్... ఐటీఎఫ్... ఇలా ఎన్నో పేర్లతో టోర్నీలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. అన్నింటా ఆడుతూనే ఉన్నా... ఏ టోర్నీలోనూ కంటబడని తమిళనాడు యువతార ఏకంగా చాంపియన్‌గా బయటపడటమే పెద్ద విశేషం. ఒకప్పుడు ఆట కోసం కిట్ బ్యాగులు మోసిన భుజాలే ఇప్పుడు డేవిస్ కప్‌లో భారత బాధ్యతల్ని మోస్తున్నాయి. ఎంతో క్రమశిక్షణతో కూడిన అతని శిక్షణ, పోటీలు, విజయాలు ఇవన్నీ కూడా గమనించిన వారికి ముచ్చటేయకుండా ఉండదు. పొద్దెక్కముందే ట్రెయినింగ్... మధ్యలో పోటీలు... పిడికిలి బిగిస్తే విజయాలు అన్నీ కూడా ఓ క్రమపద్ధతిలో కష్టపడితేనే వచ్చాయి. ఓపికగా, ఒద్దికగా అన్నింటిని భరించిన దక్షిణేశ్వర్ ఈ క్రమంలో క్రీడా జర్నలిస్టుల ప్రాధాన్యంలోనూ లేడు. కానీ ఒక్కసారిగా సంచలన విజయాలతోనే అందరి కళ్లముందుకు వచ్చాడు. ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్ ప్రకారమైతే డేవిస్‌కప్‌లో భారత జట్టు తరఫున నంబర్‌వన్ సుమిత్ నగాల్ తర్వాత ఆర్యన్ షా, కరణ్ సింగ్‌లలో ఒకరికి అవకాశం ఇవ్వాలి. అయితే భారత నాలుగో ర్యాంకర్‌గా ఉన్న దక్షిణేశ్వర్ ఆటతీరుపై నమ్మకంతో భారత జట్టు నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ ఈ తమిళనాడు పొడగరికి ఏకంగా మూడు మ్యాచ్‌లు (సింగిల్స్, డబుల్స్, రివర్స్ సింగిల్స్) ఆడే అవకాశం ఇచ్చాడు. రోహిత్ రాజ్‌పాల్‌తోపాటు భారత టీమ్ మేనేజ్‌మెంట్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా అంచనాలకు మించి రాణించిన దక్షిణేశ్వర్‌కు భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

# భారత్ ఆల్‌రౌండ్ షో.. నమీబియా చిత్తు

టీ20 ప్రపంచకప్ 2026 (T20 World Cup)లో టీమ్‌ఇండియా వరుసగా రెండో విజయం సాధించింది. దిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానం వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో నమీబియా 18.2 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది.

భారత బౌలర్ల దాటికి ప్రత్యర్థి బ్యాటర్లలో కనీసం ఒక్కరూ కూడా 30కిపైగా స్కోరు చేయలేదు. స్టీన్‌కాంప్ (29) టాప్ స్కోరర్. ఫ్రైలింక్ (22), ఎరాస్మస్ (18), జాన్ నికోల్ (13) పరుగులు చేశారు. మిగతావారెవరూ చెప్పుకోదగ్గ స్కోరు చేయలేదు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3 వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య 2, బుమ్రా, శివమ్ దూబె, అర్ష్‌దీప్ సింగ్ తలో వికెట్ తీశారు. 7 ఓవర్లకు 67/1తో ఉన్న నమీబియా తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. వరుణ్ చక్రవర్తి తన స్పెల్‌లో తొలి రెండు ఓవర్లలో స్టీన్‌క్యాంప్, నికోల్, స్మిట్ (0)ని పెవిలియన్‌కు పంపి ప్రత్యర్థి జట్టును కోలుకోలేని దెబ్బతీశాడు. అక్షర్ పటేల్ తన వరుస ఓవర్లలో ఎరాస్మస్, క్రుగర్‌ను ఔట్ చేశాడు. తర్వాత నమీబియా స్కోరు తగ్గింది. 17 ఓవర్‌లో రూబెన్‌ను బుమ్రా అద్భుతమైన యార్కర్‌తో క్లీన్‌బౌల్డ్ చేశాడు. 18 ఓవర్‌లో హార్దిక్ వరుస బంతుల్లో బెర్నార్డ్ (4), బెన్ షికోంగో (0) వెనక్కి పంపాడు. శివమ్ దూబె బౌలింగ్‌లో జేన్ గ్రీన్ (11) హిట్ వికెట్‌గా వెనుదిరగడంతో నమీబియా ఆలౌటైంది. భారత బ్యాటర్లలో ఓపెనర్ ఇషాన్ కిషన్ (61; 24 బంతుల్లో 6×4, 5×6), హార్దిక్ పాండ్య (52; 28 బంతుల్లో 4×4, 4×6) అర్ధశతకాలతో చెలరేగారు. సంజు శాంసన్ (22), తిలక్ వర్మ (25), శివమ్ దూబె (23) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఇషాన్ దంచికొట్టడంతో భారత్ స్కోరు 7 ఓవర్లకే 100 దాటింది. దీంతో టీమ్‌ఇండియా 250కుపైగా స్కోరు సాధిస్తుందని అంతా భావించారు. కానీ, వరుస విరామాల్లో భారత్ వికెట్లు కోల్పోవడంతో స్కోరు వేగం నెమ్మదించింది. చివర్లో హార్దిక్ దూకుడుగా ఆడటంతో స్కోరు 200 దాటింది. నమీబియా బౌలర్లలో గెర్హార్డ్ ఎరాస్మస్ 4 వికెట్లు పడగొట్టగా.. బెన్ షికాంగో, జేజే స్మిత్, బెర్నార్డ్ తలో వికెట్ తీశారు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో పరుగుల పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం.




# కొలంబోలో పిచ్‌ను ఎప్పుడైనా మార్చొచ్చు: పాక్ మాజీ క్రికెటర్

టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup) 2026లో భాగంగా ఆదివారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగనుంది. దీనిపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సక్లయిన్ ముస్తాక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఐసీసీని (ICC) బీసీసీఐ (BCCI) ప్రభావితం చేస్తుందన్నాడు. ప్రస్తుతమున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొలంబోలోని పిచ్‌ను ఎప్పుడైనా మార్చొచ్చని నిరాధార ఆరోపణలు చేస్తూ.. తన అక్కసు వెల్లగక్కాడు. 'ఐసీసీ ఎవరి ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తుందో మనందరికీ తెలుసు. ప్రస్తుత ఆధునిక కాలంలో ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఉందంటే.. దాని సాయంతో మనకు తెలియకుండానే గ్రౌండ్స్‌మెన్ ఎప్పుడైనా పిచ్‌ను మార్చొచ్చు' అని సక్లయిన్ ముస్తాక్ అన్నాడు. అలాగే అతడు బౌలింగ్ ఆర్డర్ గురించి మాట్లాడాడు. 'భారత్‌తో మ్యాచ్‌కు ముందు ఉస్మాన్ తారిక్ ఆత్మవిశ్వాసాన్ని పొందాడు. కానీ మీకు ఇద్దరు పేసర్లు, ఒక ఆల్‌రౌండర్ అవసరమైతే మొత్తం సమీకరణం మారిపోతుంది. జిమ్మీ నీషమ్‌ను చూడండి. అతడు ఫహీమ్ అష్రఫ్ లాంటివాడు. పాకిస్థాన్ తరఫున 20వ ఓవర్ ఎవరు వేస్తారు? తారిక్? నవాజ్? షాదాబ్? అబ్రార్? వారు చివరిగా ఎప్పుడు 20వ ఓవర్ వేశారు. ఫహీమ్ 20వ ఓవర్ వేయగలడో.. లేదో..' అని సక్లయిన్ విశ్లేషించాడు. హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగానే ఆడుతోంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన పాకిస్థాన్ రెండింట్లోనూ నెగ్గింది. అమెరికాతో మ్యాచ్ నెగ్గిన భారత్.. మరికొన్ని గంటల్లో నమీబియాతో అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా తలపడనుంది. టీమ్‌ఇండియా, పాక్ మధ్య కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఆదివారం మ్యాచ్ జరగనుంది.




## సహజ, రష్మిక ఓటమి



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. భారత నంబర్‌వన్ సహజ యామలపల్లి, రెండో ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో తెలంగాణ అమ్మాయి సహజ 3-6, 2-6తో టాప్ సీడ్ లియోలియా జీన్‌జీన్ (ఫ్రాన్స్) చేతిలో, హైదరాబాద్ ప్లేయర్ రష్మిక 2-6, 1-6తో మనన్‌చాయ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. డబుల్స్ విభాగం తొలి రౌండ్‌లో రష్మిక-అంకిత రైనా (భారత్) ద్వయం 6-1, 6-4తో జీల్ దేశాయ్-మాయా రాజేశ్వరన్ (భారత్) జంటపై గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

# సంజు శాంసన్ ఈసారైనా.. అవకాశాన్ని అందిపుచ్చుకుంటాడా?

అభిషేక్ శర్మ ఉదర సంబంధ సమస్యతో ఇబ్బందిపడుతూ ఆసుపత్రి పాలయ్యాడు. ప్రస్తుతం అతడు డిశ్చార్జి అయినప్పటికీ.. పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా మరికొన్ని గంటల్లో నమీబియాతో ప్రారంభం కానున్న మ్యాచ్ ఆడతాడా అనేది అనుమానంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పసికూనతో మ్యాచ్‌లో అభిషేక్ శర్మను ఆడించే సాహసం టీమ్ మేనేజ్‌మెంట్ చేయకపోవచ్చు. దీంతో ఈ మ్యాచ్‌లో సంజుశాంసన్ .. ఇషాన్ కిషన్‌తో కలిసి ఓపెనర్‌గా వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

**--వరుసగా విఫలమై.. దూరమై..** పొట్టి ప్రపంచకప్‌నకు ముందు న్యూజిలాండ్‌తో జరిగిన అయిదు టీ20 సిరీస్‌లో సంజుశాంసన్ వరుసగా విఫలమయ్యాడు. ఆ అయిదు మ్యాచుల్లో.. 10, 6, 0, 24, 6 పరుగులు మాత్రమే చేశాడు. మొత్తంగా అయిదు మ్యాచుల్లో కలిపి కేవలం 46 రన్స్ చేశాడు. దీంతో ప్రపంచకప్ తుది జట్టులో స్థానం కోల్పోయాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లోనూ ప్లేయింగ్ ఎలెవన్‌లో లేడు. అతడి ప్లేస్‌లో ఇషాన్ కిషన్ జట్టులో పాతుకుపోయే ప్రయత్నంలో ఉన్నాడు.

**--ఫామ్ అందుకుంటాడా..** ఫామ్ కోల్పోవడం కెరీర్‌లో ఏ క్రికెటర్‌కైనా మామూలే. అయితే ఎంత త్వరగా తిరిగి గాడిలో పడతాడనేదే కీలకం. ముఖ్యంగా తీవ్రమైన పోటీ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఎంతో ముఖ్యం. ఒకవేళ నమీబియాతో జరగబోయే మ్యాచ్‌లో సంజుశాంసన్‌కు అవకాశం వస్తే.. కచ్చితంగా రాణించాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్‌లోనూ విఫలమైతే ఇక దాదాపు అతడికి దారులు మూసుకుపోయినట్లే. ఇప్పటికే తుది జట్టులో స్థానాన్ని కోల్పోయిన సంజు.. ఇలాగే పేలవ ఫామ్ కొనసాగిస్తే అతడి పేరు 15 మంది సభ్యుల జాబితాలోనూ గల్లంతయ్యే అవకాశముందని అభిమానులు, క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# కూనలే అనుకుంటే.. ప్రపంచకప్‌లో సత్తా చాటుతున్న చిన్న జట్లు!

టీ20 ప్రపంచకప్‌లో (ICC Mens T20 World Cup) మొత్తంగా 20 జట్లు.. అందులో అసోసియేట్ దేశాలే పది.. ఆ జట్లు ఏమాత్రం పోటీ ఇస్తాయి? గ్రూప్ దశలో ఏం మజానిస్తాయి? అని సందేహించే ఉంటారు క్రికెట్ అభిమానులు. కానీ బలహీనం అనుకున్న జట్లు సత్తా చాటుతున్నాయి. ఏకపక్షం అనుకున్న మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. చిన్న జట్లు ఉత్తమ ప్రదర్శన చేస్తున్నాయి కానీ.. విజయానికి, ఓటమికి మధ్య ఉన్న చిన్న గీతను మాత్రం దాటలేక పరాజయం పాలవుతున్నాయి.

**--అనుభవలేమితో ఆఖర్లో తడబడి..** ఈ సారి కొన్ని కారణాల వల్ల టీ20 ప్రపంచకప్ ఆరంభమవుతుంటే పెద్దగా సందడి కనిపించలేదు. కానీ టోర్నీలో తొలి నాలుగైదు రోజుల్లో మ్యాచ్‌లు సాగిన తీరు చూశాక క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి పెరిగి ఉంటుంది. తొలి రెండు రోజుల్లో ఆరు మ్యాచ్‌లు జరగ్గా.. ఒక వైపు.. అన్నీ పెద్ద జట్లుంటే.. ఇంకో దిక్కు చిన్న జట్లే నిలిచాయి. జట్ల మధ్య అంతరాన్ని బట్టి చూస్తే మ్యాచ్‌లు ఏకపక్షంగా సాగి ఉండాలి. కానీ ఒక్కటంటే ఒక్కటీ అలా జరగలేదు. ఏ చిన్న జట్టూ అంత తేలిగ్గా ఓటమి అంగీకరించలేదు. బడా జట్లకు గట్టి పోటీనిచ్చాయి. కొన్ని జట్లు ప్రత్యర్థులకు ఓటమి భయాన్ని కలిగించాయి. విజయానికి చాలా దగ్గరగా వెళ్లాయి. కానీ అనుభవ లేమి వల్ల ఆఖర్లో తడబడి గెలుపు గీతను దాటలేకపోయాయి.

**--తొలి మ్యాచ్‌లోనే..** టోర్నీ తొలి మ్యాచ్‌లోనే పెద్ద సంచలనం నమోదు కావాల్సింది. నెదర్లాండ్స్‌తో 148 పరుగుల ఛేదనలో ఒక దశలో 114 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన పాక్.. ఓటమి బాటలో సాగింది. 2 ఓవర్లలో 29 పరుగులు చేయాల్సిన స్థితిలో ఆ జట్టు గెలవడం కష్టమే అనిపించింది. కానీ వాన్‌బీక్ 19వ ఓవర్లో తడబడడంతో మ్యాచ్ పాక్ వైపు మొగ్గింది. ఈ ఓవర్లో ఫహీమ్ అష్రాఫ్ 3 సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టి మ్యాచ్‌ను పాక్ వైపు తిప్పాడు. ఈ ఒక్క ఓవర్ కొంచెం కట్టుదిట్టంగా వేసి ఉంటే పాక్‌కు పెద్ద షాక్ తగిలేది.

**--ఆఖరి ఓవర్లలో..** అదే రోజు వెస్టిండీస్‌కు స్కాట్లాండ్ గట్టి పోటీనే ఇచ్చింది. 183 పరుగుల ఛేదనలో 133/5తో లక్ష్యం దిశగా సాగింది. కానీ ఆఖరి ఓవర్లలో తడబాటుతో ఓటమి పాలైంది. శనివారం రాత్రి భారత జట్టుకు అమెరికా ఎలా ముచ్చెమటలు పట్టించిందో తెలిసిందే. అమెరికాతో రికార్డుల మోతే అనుకుంటే.. భారత్ 77 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో ఇండియా ఈ మ్యాచ్ గెలుస్తుందన్న ఆశలే లేవు. 130 స్కోరు కూడా కష్టంగా కనిపించిన మ్యాచ్‌లో సూర్యకుమార్ మెరుపుల పుణ్యమా అని జట్టు 161 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లోనూ అమెరికా పోరాడినా.. భారత బౌలర్లు అవకాశమివ్వలేదు.

**--టోర్నీకే హైలెట్..** అలాగే ఇంగ్లాండ్ నేపాల్ మ్యాచ్ టోర్నీలోనే హైలైట్‌గా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు. ఎదుట 185 పరుగుల భారీ లక్ష్యం నిలిచినా.. బెదరకుండా ఛేదనలో గొప్పగా పోరాడింది నేపాల్. ఇంగ్లిష్ బౌలర్లపై ఆ జట్టు బ్యాటర్లు ఎదురుదాడి చేసి జట్టును విజయానికి అత్యంత చేరువగా తీసుకెళ్లారు. 19 ఓవర్లలో 175 పరుగులు చేసిన జట్టు.. చివరి ఓవర్లో 10 పరుగులు చేయలేదా అనిపించింది. కానీ సామ్ కరన్ అద్భుతమైన యార్కర్లు వేయడంతో అప్పటిదాకా చెలరేగిన లోకేష్ బామ్.. ధాటిగా ఆడలేకపోయాడు. అనుభవ లేమి, ఒత్తిడి వల్ల సరైన షాట్లు ఆడలేకపోవడంతో నేపాల్ త్రుటిలో ఓటమి పాలైంది.

**--ఐర్లాండ్ సైతం..** అఫ్గానిస్థాన్‌ను ఇప్పుడు పసికూన అనలేం కానీ.. న్యూజిలాండ్‌తో పోలిస్తే చిన్న జట్టే. అయినా ప్రత్యర్థికి 183 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించి సవాలు విసిరింది అఫ్గాన్. ఛేదనలో 14 పరుగులకే 2 వికెట్లు తీసి విజయావకాశాలు కూడా సృష్టించుకుంది. కానీ టిమ్ సీఫర్ట్, గ్లెన్ ఫిలిఫ్స్‌ను అడ్డుకోలేకపోవడంతో ఓటమి తప్పలేదు. శ్రీలంకతో మ్యాచ్‌లో ఐర్లాండ్ సైతం విజయానికి దగ్గరగా వెళ్లింది. కానీ ఆఖర్లో తడబడి పరాజయం చవిచూసింది. ఇక అఫ్గాన్ తన రెండో మ్యాచ్‌లో.. దక్షిణాఫ్రికాకు ముచ్చెమటలు పట్టించింది. మ్యాచ్‌లో ఆ జట్టు ముందు 188 పరుగుల భారీ లక్ష్యం నిలిచినా.. బెదరలేదు. 3 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన స్థితిలో ఆ జట్టే గెలిచేలా కనిపించింది. కానీ ఆఖర్లో తడబడడంతో మ్యాచ్ టై అయింది. తొలి సూపర్ ఓవర్లో స్కోర్లు సమమవడంతో ఇంకో సూపర్ ఓవర్ అనివార్యమైంది. అందులో అఫ్గాన్ త్రుటిలో ఓడింది.

ఇలా టోర్నీలో చిన్న జట్ల ప్రదర్శన ఉత్తమంగానే సాగుతూ క్రికెట్ అభిమానులకు కిక్కిస్తోంది. టోర్నీ మీద ఆసక్తి పెంచుతోంది. ఇప్పటిదాకా మ్యాచ్‌లు జరిగిన తీరు చూశాక ఏ పెద్ద జట్టూ చిన్న జట్లను తేలిగ్గా తీసుకోదన్నది వాస్తవం.

